క్లుప్తంగా

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ

నెహ్రూనగర్: ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహావిష్కరణను ఈ నెల 12న గుంటూరులో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ మండల్ సిఫార్సుల్ని అమలు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 10న మంగళగిరిలో బీపీ మండల్ -2 ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా గుంటూరులో బీపీ మండల్ విగ్రహావిష్కరణ జరుపుకోవడం బీసీలకు గర్వకారణమని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు డాక్టర్ శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పావులూరి హనుమంతురావు, కన్నా మాస్టారు, తన్నీరు ఆంజనేయులు, కోలా అశోక్, నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయోపరిమితి పెంపుపై హర్షం

ఏఎన్‌యూ: యూనివర్సిటీల్లో బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం అధ్యక్షుడు వై. వెంకటప్పారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు ఆయన తెలిపారు. అడగగానే పదవీ విరమణ వయస్సు పెంచమని అధికారులకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ వయస్సు పెంచడానికి సహాయ, సహకారాలు అందించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



గుంటూరు లీగల్: ఏసీ కాలేజీ లా చివరి సంవత్సరం విద్యార్థులు బుధవారం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సందర్శించారు. వినియోగదారుల హక్కులు, విధులపై కమిషన్ అధ్యక్షురాలు టి.సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డితో మాట్లాడి, తమ సందేహాల్ని నివృత్తి చేసుకున్నారు. వినియోగదారుల కమిషన్ అధికారాల్ని తెలుసుకున్నారు. ఏసీ కాలేజీ స్టాఫ్ జి.కిరణ్, బత్తుల డేనియల్, సీనియర్ న్యాయవాది, కాలేజీ లెక్చరర్ డాక్టర్ బుర్రా మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గుర్తు తెలియని యువకుడికి చికిత్స



గుంటూరు ఈస్ట్: వివరాలు తెలియని యువకుడు జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్నాడు. సుమారు 20 సంవత్సరాల యువకుడు కాజ రైల్వే గేటు సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉండగా, స్థానికులు 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆర్‌ఐసీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. ఫొటోలోని యువకుడిని గుర్తించిన వారు జీజీహెచ్‌కు వెళ్లి కలవవచ్చు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మరో ఇరువురికి గాయాలు

గుంటూరు ఈస్ట్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఅగ్రహారం చెందిన బేతం ప్రభుదాస్ (25) మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతున్నారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుండి ఢీకొంది. ప్రమాదంలో బేతం ప్రభుదాస్ ఘటన స్థలంలో మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే ప్రభుదాస్ బతికేవాడని స్థానికులు చెబుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: అప్పుల బాధ భరించలేక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ..నల్లపాడు గ్రామానికి చెందిన బుచ్చినబోయిన వెంకటేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి పిచ్చయ్య బంధువులను, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా



కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ డొక్కా ప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి స్పష్టంగా పెరుగుతోందనితుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 14వ డివిజన్ డీఎస్ నగర్‌లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు అందుతున్న నిధులతో స్వయం ప్రతిపత్తి పెరిగి తద్వారా వారు ఆర్థికంగా ఎదగుతున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పేద, బడుగు, బలహీనవర్గాలు ఆర్థిక లోటు లేకుండా, స్వయం ఉపాధి ద్వారా ఎదగగలుగుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల మాదిరిగా మధ్యవర్తులు లేకుండా నేరుగా వైఎస్సార్ ప్రభుత్వంలోనే నేరుగా నిధులు లబ్ధిదారులకు అందుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యల్ని ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, వేముల శ్రీనివాసరావు, శ్రీనివాస రెడ్డి, నాగేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

సమన్వయంతో పథకాలపై అవగాహన కల్పించాలి

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని వార్డు వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా తెలిపారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం 1, 2, 3, 4, 8, 9 డివిజన్ల కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. పేదల అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈనెల 20 తేదీ నుంచి 27వ తేదీ వరకు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదంతో ఇంటి వారు అనుమతితో స్టిక్కర్లు, పోస్టర్లు అంటించాలని సూచించారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి భాస్కరరావు, కార్పొరేటర్లు కామరెడ్డి రంగారెడ్డి, మర్రి అంజలి, పోలవరపు జ్యోతి, షేక్ మహమూద్, ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, వాకా శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, నగరంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉగాది నాటికి ప్రతి లే అవుట్‌లో గృహ ప్రవేశాలు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లకు అందించే ఇనుము పంపిణీలో లోపాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేసి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎండీకి లేఖ రాస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని, ఇందులో ఎటువంటి అవినీతికి పాల్పడినా పోలీసు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. లే అవుట్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె చెప్పారు. అనంతరం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులకు వెంటనే సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా నగరంలోని పబ్లిక్ టాయ్‌లెట్స్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఏఈలను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ ఐలాండ్స్ పనులు, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ పనులు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన ప్రాంతాల్లో డ్రైయిన్ల నిర్మాణం వేగంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వైభవంగా శారదా పరమేశ్వరి ప్రతిష్ట మహోత్సవాలు



వీణా నాదార్చన చేస్తున్న భారతీదేవి శిష్య బృందం

పాత గుంటూరు: సంపత్ నగర్‌లో శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవాల్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. లలితా సహస్ర నామ హోమం భక్తిశ్రద్ధలతో జరిపారు. శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకులు, ప్రముఖ వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి శిష్య బృందం పంచ వీణలతో అమ్మవారిని నాదార్చనతో సేవించారు. శ్రీ త్యాగరాజస్వామి కృతులు, అన్నమయ్య సంకీర్తనలు, అనేక వాగ్గేయకార సంకీర్తనల్ని ఆలపించారు. వీరికి మృదంగంపై సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కళాకారుల్ని ఘనంగా సత్కరించారు.

హరికథా భాగవతార్ కోట సచ్చిదానందశాస్త్రికి సన్మానం



సచ్చిదానందశాస్త్రిని సన్మానిస్తున్న మస్తానయ్య, శివరామకృష్ణ తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై బుధవారం శ్రీ త్యాగరాయ స్వరభారతి సంగీత కళాశాల వార్షికోత్సవం, శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం, వైణిక విద్వాన్ శ్రీమాన్ కొమండూరి తిరుమలాచార్యులు వర్ధంతిని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు కొమండూరి వెంకట అనంత శైనం ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ధూళిపాళ్ల శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, విశ్రాంత ఏఈ దెందుకూరి శ్రీరామమూర్తి పాల్గొన్నారు. మస్తానయ్య మాట్లాడుతూ హరికథా రంగంలో కోట సచ్చిదానందశాస్త్రి కృషి చిరస్మరణీయమని, ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం సంగీత కచేరీలో గాయకులు పలు కీర్తనలు ఆలపించి అలరించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'భాష్యం'కు 99.99 పర్సంటైల్



జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్-2023 జనవరి ఫలితాల్లో భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ విద్యార్థులు 99.99 పర్సంటైల్‌తో అఖిల భారతస్థాయిలో సంచలనం సృష్టించారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో బుధవారం విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎ. వెంకట శివరామ్, పి.నిశ్చల్ సుభాష్, సీహెచ్. కుందన్ సాయి 99.99 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో టాపర్లుగా నిలిచినట్లు చెప్పారు. విద్యార్థి పి. నిశ్చల్ సుభాష్ అఖిల భారతస్థాయిలో ఓపెన్ కేటగిరీలో ఈడబ్ల్యూస్ విభాగంలో 4వ స్థానంతో విద్యాసంస్థకే గర్వకారణంగా నిలిచాడని తెలిపారు. 18 మంది విద్యార్థులు 99.9, 42 మంది విద్యార్థులు 99.7, 54 మంది విద్యార్థులు 99.5, 82 మంది విద్యార్థులు 99 పర్సంటైల్‌తో పాటు వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు ఎనిమిది మంది ఉన్నారని ఆయన వివరించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ఏటా అంచనాలకు అందని ఫలితాల్ని సాధిస్తున్నామని చెప్పారు. ఈ సంచలన విజయాలకు భాష్యం ఐఐటీ ఫౌండేషన్ కరిక్యులమే కారణమని రామకృష్ణ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తెనాలి రూరల్: చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో గతేడాది జరిగిన మూడు చోరీ కేసుల్లో నిందితుడిని నందులపేటకు చెందిన కోటిసాయి మంజునాథగా గుర్తించారు. ఈ కేసులను దర్యాప్తు చేసిన సీఐ కె. చంద్రశేఖర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు అక్టోబరులో ఇతని వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను రికవర్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సునీల్‌కుమార్ వాదించారు.

11న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) 48వ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 11న కలెక్టరేట్ వద్ద ఉన్న రెవిన్యూ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా కౌన్సిల్ సమావేశాల పోస్టర్, ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ పరిణామాలు, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు సమావేశంలో మాట్లాడతారని పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏ.ఎల్. శివపార్వతి, సీపీఎస్ కన్వీనర్ సీహెచ్. ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు ఎండీ షకీలాబేగం, జి. వెంకటేశ్వర్లు, ఎం. గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు గురుబ్రహ్మం, కె. రంగారావు, ఎస్. ధనరాజారావు, కె. ప్రేమ్‌కుమార్, ప్రసాద్, రమేష్, ప్రభుజీ, బాజీబాబా, అనిల్ పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ వి. అనురాధ సూచించారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన జెమిలి డెంటల్ కేర్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ నారాయణ్, డాక్టర్ జమిలి, డాక్టర్ హర్షిత జమిలి, డాక్టర్ గుమ్మడి గౌతమ్‌లు 400 మంది విద్యార్థులకు ఉచితంగా దంత తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అంకమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం అక్రమంగా విక్రయిస్తున్న డీలర్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 2వ లైనులో షాపు నిర్వహిస్తున్న డీలరు దాసరి వెంకటరమణ రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ డెప్యూటీ తహసీల్దార్ శివశంకర్ బుధవారం తనిఖీలు జరిపారు. 106 క్వింటాళ్ల రేషన్ బియ్యం లెక్కల్లో వ్యత్యాసం గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



తెనాలి అర్బన్: ఇంటర్నేషనల్ బిషప్ గద్దం థామస్ 2వ వర్ధంతిని అయితానగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద పాస్టర్లకు నూతన వస్త్రాల్నిపంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్దం సన్నీ డానియేల్, గద్దం డేవిడ్ జాన్, గద్దం థామస్ జాన్, బాబు, చొప్పర డానియేల్, పీటర్ పాల్గొన్నారు.

తూర్పులో దశల వారీగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే ముస్తఫా



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముస్తఫా చెప్పారు. ప్రజలకు కనీస అవసరాలైన రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 15వ డివిజన్‌లోని హుస్సేన్ నగర్‌లో బుధవారం రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 6వ డివిజన్ కొత్తపేట చిన్న ఆంజనేయస్వామి గుడి వీధిలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే గుంటూరు నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, పాణ్యం మురళి, మస్తాన్, మున్వర్, సలీం, టోపీబాబు, షరీఫ్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే అధికారం సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

నెహ్రూనగర్: బహుజనులు రాజకీయ చైతన్యవంతమైనప్పుడే అధికారం సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి పిలుపునిచ్చారు. బహుజనుల అభ్యున్నతికి ఏకైక ప్రత్యామ్నాయ పార్టీ బీఎస్పీనే అని పేర్కొన్నారు. బహుజనుల రాజకీయ చైతన్యం కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర కార్యక్రమాన్ని బుధవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రకులాల పార్టీల మధ్యనే అధికారి మార్పిడి జరుగుతోందని ఆరోపించారు. అగ్రకులాల రాజ్యాధికారంలో బహుజనులు అభివృద్ధికి దూరమయ్యారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు వంద సీట్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతా నాగేశ్వరరావు, నాయకులు కిశోర్, ఎం. బాలయ్య, మల్లికల్ పాల్గొన్నారు.

రంజాన్‌లోగా లాలాపేట పెద్ద మసీదు అభివృద్ధి

ముతవల్లీలకు డీఆర్వో చంద్రశేఖర్ ఆదేశం



మసీదును పరిశీలిస్తున్న డీఆర్వో చంద్రశేఖర్

లక్ష్మీపురం: చారిత్రత్మక లాలాపేట మసీదు అభివృద్ధి ముతవల్లీలు బాధ్యత వహించాలని, రానున్న రంజాన్ లోగా అన్ని సదుపాయాలు కల్పించాలని ముతవల్లీలను డీఆర్వో చంద్రశేఖర్ ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ సాంబశివరావు, గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ముఖ్తార్ బాషా బుధవారం మసీదు ముతవల్లీలు, మత పెద్దల సమక్షంలో సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మసీదుకు వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేయాలని ముతవల్లీలకు సూచించారు. మసీదు పైభాగంలో ఉన్న మీనార్ శిథిలావస్థకు చేరిందని, దాన్ని తక్షణమే మరమ్మతులు చేయించాలని చెప్పారు. రంజాన్ మాసం సమీపిస్తున్న తరుణంలో నమాజ్‌కు వచ్చే వారి కోసం మరుగు దొడ్లు, విద్యుత్ వసతి, వజూఖానాలతో పాటు మసీదులో ఎయిర్ కండీషనర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ కోత సమయంలో ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు.

జిల్లా జడ్జిగా మంచి తీర్పులు ఇవ్వాలి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీదేవి

గుంటూరు లీగల్: జిల్లా జడ్జిగా శ్రీదేవి మంచి తీర్పులు ఇచ్చి హైకోర్టు వరకు వెళ్లాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసూదనరావు అన్నారు. గుంటూరు ఆరో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న శ్రీదేవి తెలంగాణ రాష్ట్రంలో జిల్లా జడ్జిగా ఇటీవల ఎంపికైయ్యారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం ఓ హోటల్‌లో జిల్లాలోని కేడర్, టెన్యూర్ ఏపీపీల ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మధుసూదనరావు మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు శ్రీదేవిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్కా శారదా మణి, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ప్రాసిక్యూటర్లు చారుమతి, స్వర్ణలత భాను, లక్ష్మీరామ్ నాయక్, శౌరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి, ఆమె భర్త డీఎస్పీ రవిచంద్రను ఘనంగా సన్మానించారు. తెనాలి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ స్వాగతం పలుకగా, చిలకలూరిపేట ఏపీపీ అల్లంశెట్టి పవన్ వందన సమర్పణ చేశారు.

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం కావాలి



విజేతలతో కృష్ణప్రసాద్, రథినీ చౌదరి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం కావాలని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో బుధవారం 37వ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయని తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం పాఠశాలలో విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంచడంలో క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్ని నాలుగు హౌస్‌లుగా విభజించి, నిర్వహించిన పోటీల్లో ఆకాశ్, పృథ్వీ, అగ్ని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు కె. బసవపున్నయ్య, ఏవో కె. వెంకట్రావు విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

పొన్నూరు(చేబ్రోలు): మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులు, భక్తుల అవసరాల నిమిత్తం ప్రత్యేక బస్సు సర్వీసుల్ని నడుపుతున్నట్లు ఆర్టీసీ పొన్నూరు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో యూనియన్ నాయకులు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ పొన్నూరు నుంచి శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానానికి ఐదు ప్రత్యేక బస్సులు, పొన్నూరు నుంచి గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి ఎనిమిది బస్సులు నడపటానికి నిర్ణయించినట్లు తెలిపారు. బాలకోటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు ఆర్టీసీ అధికారులు అదనపు చార్జీలు లేకుండా పాత చార్జీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎన్ఎంయూ నాయకులు ఏఏ బేగ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.